
# చివరకు మిగిలింది

## పత్లేటి బాలాజీ

( జన్మదిన కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ )



కడుపులో కదలాడేది మగబిడ్డో, ఆడబిడ్డో తెలుసుకోవాలన్న ఆతృతతో ప్రసవం కోసం ఎదురు చూస్తున్న నిండు గర్భవతిలా ఉంది ఆకాశం!

మసక వెలుతురులో నిశ్శబ్దం కూడా లయబద్ధంగా నాట్యం చేస్తున్నట్లుంది!

"క్కొక్కొరొక్కొ!"

దూరంగా ఎక్కడో కోడి పుంజు కూత వేసిన శబ్దం.


తర్వాత మళ్లీ నిశ్శబ్దం.

తూర్పున అడ్డుపడ్డ మేఘాల్ని చీల్చుకుని ఆకాశంమీద కెగబాకడానికి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు బాల భాస్కరుడు!

ఇంటి ఆవరణలోని చెట్ల మీద నిద్రిస్తున్న పక్షులన్నీ ఒక్కసారిగా కిలకిలారావాలు చేశాయి.

సృష్టిలోని సమస్త రాగాలూ మిళితమైన

సంగీతంలా ఉంది వాటి కిలకిలారావం!
ఆహారం కోసం ఆకాశంలో విహారానికి సిద్ధపడ్డాయి పక్షులు.
తెల్లవారింది ...!
ఎప్పుడూ తొలికోడి కూతకు ముందే నిద్ర లేచేవాడు పెదరెడ్డి. కానీ ఈ రోజు తెల్లవారాక కానీ మంచం దిగలేకపోయాడు.
మంచం పక్కనే ఉన్న పొన్ను కర్ర చేతికి తీసుకుని పొలం వైపు బయలుదేరాడు. రాత్రి తెల్లవార్లూ ఆలోచనలతో సతమతమైన పెదరెడ్డి మొహంలో నిద్ర లేమి కొట్టొచ్చినట్టు ఎంతో స్పష్టంగా కనిపిస్తోంది.
నిన్న కొడుకు చెప్పిన దంతా నిజమే ననిపిస్తోంది. ఎంత ఆలోచించినా కొడుకు చెప్పినదాంట్లో ఏ చిన్న లోపమూ లేదనిపిస్తోం దతనికి.
కానీ ఎక్కడో ఏదో తేడా ఉందనిపిస్తోంది. ఎంత ఆలోచించినా ఆ తేడా ఏమిటో తెలియడంలే దతనికి.
కొడుకు కేమని సమాధానం చెప్పాలా అని తీవ్రంగా ఆలోచిస్తూ నడుస్తున్నా డతడు.
బాలభాస్కరుడి సును లేత కిరణాల తాకిడితో మంచు తెరలు మెలమెల్లగా విడిపడుతున్నాయి.
ఎంత ఆలోచించినా కొడుకు కేమి సమాధానం చెప్పాలో పెదరెడ్డికి తెలియలేదు.
అస్తవ్యస్తమైన ఆలోచనలతో పొన్నుకర్ర చేతబట్టిన పెదరెడ్డి పొలం గట్ల మీద మెల్లగా నడుస్తున్నాడు.
"నాయినో! ఈసారి రొయిల గుంటలోళ్లు ఎకరా లక్ష రూపాయలకు కొంటామని చెప్పంపించినారు!" కళ్లంలోని వడ్లు బస్తాలకు కలిపిస్తున్న పెదరెడ్డితో ఎంతో సంతోషంగా చెప్పాడు రవి.
'అట్లనా!' అన్నట్టు కొడుకు వైపోసారి చూశాడు.
కొడుకుతో ఏమీ మాట్లాడకుండా 'ధాన్యం రాశివైపు చూస్తూ, 'ఈతూరి పంట చానా బాగా పండినట్టుండాది' అనుకున్నాడు పెదిరెడ్డి.
కొలగాడు రాశిలోని వడ్లను కొలిచి బస్తాల్లో పోస్తున్నాడు. కొలగాడు ఇరసాంతో నింపిన వడ్లని గోతాల్లోకి పోస్తున్నప్పుడు వడ్ల నూగు పై కెగురుతోంది.
'ఎకరా లక్ష రూపాయలంటే మాటలా? తండ్రి కూడా ఎగిరి గంతేస్తాడు. సంతోషంగా అమ్మడానికి అంగీకరిస్తాడు' అని ఆశించిన రవికి తండ్రి ప్రవర్తన మనస్సుని చివుక్కుమనిపించింది.
పెదరెడ్డి కళ్లంలోని వడ్లన్నీ బస్తాలకి కలిపించాడు. కూలీలు వడ్ల బస్తాల్ని ఎద్దుల బళ్ల మీదకు ఎక్కించడం మొదలుపెట్టారు.
"నాయినో! నువ్వు సరేనంటే రొయిల గుంటలోళ్లు రేపే అడ్వాన్స్ కూడా తెచ్చిస్తా నన్నారు."
పెదరెడ్డి కొడుకు కేమీ సమాధానం చెప్పలేదు.
"లక్ష రూపాయలు! అమ్మో! నిన్నగాక మొన్న ఈడు పుట్టకముందే కదా ఎకరా ఐదొందలకి ఆరొందలకీ కొన్నాను. అట్టాటిది ఇప్పుడు ఎకరా లక్ష రూపాయలా?"
పెదరెడ్డికి కించిత్ గర్వం కూడా వేసింది. కానీ వెంటనే 'అయినా, ఇంత దరబెట్టి కయిలు గొంటున్నారంటే ... పొలం కోసరం గానే కాదు. వోళ్లకు గావల్సిన స్థలం కోసరం గావాలా!' అనుమానంగా అనుకున్నా డతడు.
ఒంగోలు గిత్తలు ఒక్కసారి తలలు విదిలించాయి.
వాటి మెడల్లోని కంచు • గంటలు గలగలమంటూ లయబద్ధంగా మోగాయి. పోలేరమ్మ జాతర ఊరేగింపులోని డప్పుల శబ్దాన్ని గుర్తుకు తెచ్చిం దతడి కా గంటల శబ్దం!
కంచు గంటల గలగలలతో కళ్లంలోనుంచి బళ్లు మెల్లగా కదిలాయి. కదిలి వెళ్తున్న బళ్లవంకా, వడ్ల బస్తాలవంకా ఎంతో తృప్తిగా చూసుకోసాగాడు పెదరెడ్డి.
కదిలి వెళ్తున్న బళ్లని చూస్తుంటే ఏడాది కోసారి ఊళ్లో జరిగే జాతర ఊరేగింపులా ఉంది.
పండిన ధాన్యాన్నంతా తీసుకుని ఉత్సవ విగ్రహాల్లా బళ్లు ఊరివైపు వెళ్తుంటే పొలం




మాత్రం మూల విగ్రహంలా అక్కడే నిలబడి వాటి వైపు చూస్తోంది.
ఏడాది పొడుగునా చేసిన పూజల్ని పంచడానికి వెళ్తున్న ఉత్సవంలా ఉంది.
'పదెకరాల పొలం పాతిక పుట్లు పైన్నే బండింది. మంచి కనుబడి. ఈయేడు ఊరికంతా గూడా కూటికి దిగు ల్లేనంత బండింది' అనుకున్నాడు పెదరెడ్డి.
రవికి మాత్రం రొయ్యలగుంటలోళ్లు చెప్పిన ఎకరా లక్ష రూపాయలు అన్న మాటలే మదిలో మెదులుతున్నాయి.
'పదెకరాలు పది లక్షలు!' అనుకున్నాడు రవి.
'పదెకరాల్ని అమ్మేస్తే పది లక్షలు వస్తుంది. దాన్ని తీసుకెళ్లి పట్నంలో మావతో ఫైనాన్స్ వ్యాపారం జేస్తే ... సంవత్సరానికంతా అంతకంత సంపాదించొచ్చు. 'ఏ వ్యాపారంలోనైనా నష్టం వస్తుందేమో గానీ, ఫైనాన్స్ వ్యాపారంలో నష్టం రాదు. నాయి నేందో నేను సతపోరి చెప్తున్నా పట్టించుకోవడంలేదు. నాయిన్ని ఎట్టయినా ఒప్పించి కయి లమ్మెయ్యాల్సిందే!' అనుకున్నాడు.
"నాయినో! నా మాటల్ని అసలు పట్టించుకున్నట్లే లేదు. ఇంతకీ ను వ్వేం జెప్తావు?" తండ్రిని అడిగాడు రవి.
అతడి మాటల్లో కాస్త తొందరపాటు కనిపిస్తోంది.
"యేం జెప్పమంటావురా!" అడిగాడు పెదరెడ్డి.
"అదిగాదు నాయినా, ఎకరాకి లక్ష రూపాయ లంటే తక్కువా జెప్పు?"
"లక్ష రూపాయలు తక్కువెట్లవుతా దిరా?"
"మరయితే ఇంకా ఆలోచన దేనికి?"
"అదిగాదురబయా! రేటేవేఁ మంచిదే గానీ, ఒకేసారిగా ఈ పొలవంతా అమ్మేసుకొని ... అసలు కయిల్లేకపోతే యెట్టరా?"
"కయిల్లేకపోతే ఏం?"
"అదిగాదురా, ఈ కయిలే మనకి చానా కాలంగా కూడు బెడ్తుండాయిరా!"
"యేం, ఈ కయిలమ్ముకొని బోతే పట్నంలో కూడే దొరక దనుకుంటుండావా?"
"పట్నంలో కూడు దొరకదని గాదురా ..."
"మ రిం కెందు కాలోచన? మంచి రేటొచ్చినప్పుడు అమ్మేసి హాయిగా పట్నం వెళిపోదాం. అసలు వ్యవసాయంలో నీ కేం మిగుల్తుండాది నాయినా? అదే కయిల్ని పది లక్షల కమ్మేసి, ఆ డబ్బు బ్యాంకులో వేసుకున్నా చాలు, వద్దంటే సంవత్సరానికి లక్ష రూపాయల వడ్డీ చేతిలో కొస్తుంది. వ్యవసాయంలో అంత మిగుల్తాదా చెప్పు? పోయిన సంవత్సరం జాడు - టుంగ్రో వైరసొచ్చి పైరంతా నిలువునా మాడిపోయిందా! ఈ యే డేదో నక్రంగా పండింది గాబట్టి పాతిక పుట్లయినాయి. ఆ పాతిక పుట్లు అమ్మినా ఎంతొస్తుంది - ఓ డెబ్బయ్ వే లొస్తాయేమో. దానికి నువ్వు పెట్టిన పెట్టుబడి, కూలోళ్ల కర్చులూ, పెట్టుబడి మీద వడ్డీ - అంతా తీసేసి జూస్తే పది వేలు కూడా మిగల్దు. పోయి నేడు నష్టం గూడా దాన దీసేస్తే నీ రెక్కల కష్టం గూడా మిగల్దు, నాయినా! అయినా వ్యవసాయంలో రెక్కల కష్టం దప్ప ఏం మిగుల్తాది జెప్పు?"

అంటూ ఎంతో వివరించి చెప్పాడు రవి.

"అదిగాదు రబయా! ..."

"నాయినో! ను వ్వేంకేం మాట్లాడబాక! నీకు జూస్తేనా వయను అరవై పైబడిపోయింది. అదే ఉద్యోగస్తుడైతే రిటరయ్యి ఇంట్లో గూర్చుని కృష్ణా రామా అనుకోవాల్సిన వయను. నీ తర్వాతంతా జూనుకోవాల్సింది నేనే గదా! అందుకని నా ఇష్టప్రకారం కయిలన్నీ అమ్మేసి అందరం వట్నం వెళ్లిపోతేనే మంచిది. వట్నంలో మావని జూడు, పైనాన్స్ వ్యాపారంలో నంపాదించి మిద్దె మీద మిద్దె కట్టినాడు. నకల సౌకర్యాలతో హాయిగా వట్నవానం జేస్తున్నా డాయన. మనం గూడా వట్నానికి పొయ్యి మావతో గూడా జేరి పైనాన్స్ వ్యాపారం జేద్దాం! పైనాన్స్ వ్యాపారం నంగతంతా నేనే జూనుకుంటా. నువ్వు దర్జాగా కాలి మీద కాలేనుకొని నీడవట్నే నల్లంగా కూర్చోనుండొచ్చు!" అని ఎంతో మర్యాదగా తండ్రితో చెప్పాడు రవి.

ఎంత మర్యాదగా చెప్పినా అతడి మాటల్లో పొలం అమ్మేయాలని నిర్ణయం తీనుకున్నట్లు తెలిసిపోతోంది.

"మీ మావ నీ చిన్నప్పుడే నా కయిలన్నీ అమ్మేసి తన యాపారంలో బాగం దీనుకోమన్నాడ్రా! కానీ నేనందుకు అప్పుడూ ఒప్పుకోలా! కానీ నువ్విప్పుడు ..."

"నాయినో నువ్వేంకేం అర్థం జెప్పబాక!"

"అట్ల తొందరవడబాకరబయా! యోచన జెయ్యడానికి నా క్కొంచెం నందీరా! ఏ నంగతీ నీకు రేప్పొద్దున జెప్తా!" అని చెప్పి కొడుకుని కొన్త నమాధానవరిచాడు పెదరెడ్డి.

'నాయిన క్కూడా ఇంతకంటే రేటు రాదని తెలును. కానీ చిన్నవాడ్ని నేను చెప్పేనరికి పొలం అమ్మడానికి తన పెద్దరికవు అహం అడ్డొస్తోంది కాబోలు!' అనుకున్నాడు రవి.

కానీ పెదరెడ్డి పొలాలమ్మడానికి వెనుకంజ వేసేది తన పెద్దరికవు అహంతో కాదు; కొడుకు చెప్పిన దాంట్లో ఏదో తేడా కనిపిస్తోం దతడికి. ఆ తేడా ఏమిటో తెలియకే ఏమీ చెప్పలేక నతమత మవుతున్నాడు.

"దండాల్రెడ్డా!" అంటూ పెదరెడ్డికి వినయంగా నమన్కరించాడు నారయ్య.

నారయ్యవంకా, కయిల్లో మందగట్టే ఉన్న గొర్రెల గుంపు వంకా చూస్తూ, "యాం నారిగా! గొర్రెలన్నీ బాగుండాయా?" అనడిగాడు పెదరెడ్డి.

"యేదో తవురి దయ సామే!"

నారయ్యకు గొర్రె లున్నాయి. వాటిని మేవుతూ బతుకుతుంటా డతడు. పైరు కోసేసిన తర్వాత నారయ్యతో చెప్పి కయిల్లో గొర్రెల్ని మంద కట్టిస్తుంటాడు పెదరెడ్డి. కయిల్లో గొర్రెల్ని మందకట్టించడం వల్ల పొలం సారవంతమై బాగా వండుతుంది.

"నారిగా! ఈ వది పూట్లా అన్ని కయిల్లో మంద గట్టు!" అంటూ ముందుకు సాగిపోయాడు పెదరెడ్డి.

దున్నపోతుల్ని వలువుల్తో ఒకదాన్ని ఒకటి పెనేసి కళ్లంలోని వన తొక్కించడం చిన్నతనంలో చూసి, "తూ! యాక్! దున్నపోతులు వడ్లని తొక్కుతున్నాయ్!" అన్న కొడుకు, బళ్లమీద ఇంటికి తోలుకొచ్చిన వడ్లు ఇంటి ముందు కట్టిన కూటులో పోస్తుంటే, "నాయినో! వడ్ల గింజ లెట్ల మొలుస్తాయ్! ఇన్ని వొడ్లెట్ల వండతా య్!" అని ఎంతో అమాయకంగా అడిగిన కొడుకు ఇప్పుడు లాభ నష్టాల్ని ఆదాయవ్యయాల్ని గూర్చి అంత చక్కగా తనకే వివరించి చెప్పినందుకు ఎంతో ఆశ్చర్యపోసాగాడు పెదరెడ్డి.

గెనాల మీద నడుస్తూ, కయిల వంక చూస్తూ ఆలోచనలతో నడవసాగాడు పెదరెడ్డి.

"యెంత రొయిల గుంటలకైనా యెకరా లక్ష రూపాయలు బెట్టి యెట్ల గొంటుండారబ్బా?"

"రొయిల గుంటల్లో దానా ఆదాయముంటాది. ఆ రొయ్యల్ని విదేశాలకు ఎగుమతి చేస్తారు. అందువల్ల ప్రభుత్వానికి గూడా దానా ఆదాయం వస్తుంది. అందుకనే రొయిల గుంటలకు బ్యాంకులు, గవర్నమెంట్ వాళ్లు కూడా లోన్లు దండిగా ఇస్తుండారు అని అబ్బయ్య జెప్పినాడు గదా!" అని నమాధానవరచుకున్నాడు పెదరెడ్డి.

తన ప్రచండతాపాన్ని భూమ్మీదకు చూపాలన్న ప్రయత్నంలో ఉన్న సూర్యుడు ఆకాశం మీదకు ఆత్రంగా ఎగబ్రాకసాగాడు.

మొహానికి వట్టిన చెమటను తడిగుడ్డతో తుడుచుకుని కళ్లం మిట్ట మీదున్న చింతచెట్టు కింద నిలబడ్డాడు పెదరెడ్డి.

వక్క కయిల్లో కోసి వరున క్రమంలో పేర్చిపెట్టిన వరి వనల్ని మెంట్లతో మోపులు కడుతున్నారు కూలీలు.

వనల్లోంచి రాలివడ్డ వరి వెన్నుల్ని వరిగేరుకుంటున్నారు చిన్నపిల్లలు.

కోసేసిన వరి ముట్టెల్లో అక్కడక్కడా మొలకెత్తి ఉన్న వచ్చటి మోపుల్ని పీక్కు తింటున్నాయి రెండు బర్రె దూడలు.

రాత్రి తెల్లవార్లూ వరివనల కింద చేరి వడ్ల గింజల్ని తిన్న ఓ వరికోళ్ల గుంపు కూలీలు వన లెత్తగానే తుర్రుమంది. వాటిని వట్టుకోవాలన్న ఆశతో ఆత్రుతగా అటూ ఇటూ వరుగెత్తుతున్నా రిద్దరు కూలీలు.

"ఏ నంగతీ నీకు రేప్పొద్దున జెప్తా' అని జెప్పడమైతే జెప్పేసినా! ఇప్పు డేడి కేవని జెప్పా ల్నేను?"

నంతృప్తికరమైన నమాధానం దొరకలేదు పెదరెడ్డికి.

'అనలు రాత్రి కూడు దినేటప్పుడు ఎంత ఇవరంగా జెప్పినాను!

"నాయినో! ఆ డెకరా, ఈ డెకరా ఉండే వోళ్లు కూడా ఇదే మంచి రేటని రొయిలగుంట లోళ్ల దెగ్గిర అడ్వాన్సులు దీసేనుకున్నారు. మనకుండే వదెకరాలుదట్టుగా ఒకే దెగ్గిరుండాది. కాబట్టి, మనం డిమాండ్ జేస్తే ఇంకొంచెం రేటు గూడా బలకొచ్చు!" తండ్రి మదిలో డబ్బు ఆశ రేకెత్తించేందుకు చెప్పాడు రవి.

కంచంలో కలిపి చేతికెత్తుకున్న అన్నం ముద్ద నోట్లో పెట్టుకోబోతున్నవాడల్లా ఆగి, కొడుకు మొహంలోకి సూటిగా చూస్తూ, "మంచి రేటు వలకతుండాదని కయిలమ్మేద్దామంటావా?" అడిగాడు పెదరెడ్డి.


తండ్రి మాటకంటే చూపుకి కొద్దిగా భయంతో జంకాడు రవి. వెంటనే తండ్రికి నమాధానం చెప్పేందుకు తటవటాయించాడు.

కొద్దిసేపటికి నర్దుకుని, "మంచి రేటు వలికేటప్పుడు అమ్మేస్తే తప్పే ముండాది, నాయినా!" అని ఎంతో నెమ్మదిగా చెప్పాడు.

ఆ మాటతో చివుక్కున తలెత్తి, "అమ్మేస్తే తప్పు లేదురా! అనక మన మేం జెయ్యాల?" కొంచెం కోపంగానే కొడుకు నడిగాడు -

"యేం జేసే దేవుండాది! వట్నం బొయ్యి మావతో గూడా జేరి పైనాన్స్ వ్యాపారం జెయడమే నని సాయింకాలం కళ్లంకాడ జెప్పినాను గదా! అయినా ఆ వ్యాపారం నంగతి గూడా నువ్వు జూడబన్లా. అంతా నేనే జూనుకుంటా! నువ్వు దర్జాగా కాలి మీద కాలేనుకొని నీడవట్నే కూర్చోనుండు, చాలు!"

కొడుకు మాటలు పెదరెడ్డికి నచ్చలేదు. కొడు కెలాగైనా నచ్చచెప్పాలని, "ఒరే అబయా! ఒక మాట జెప్తా, కొంచెం తీరిగ్గా ఇని, బాగా ఆలోచించు. మ నూరోళ్లందరూ వాళల కం[illegible]లన్నీ రొయిల గుంటలోళ్ల కమ్మేసినా రనుకో! [illegible]ప్పుడు



మనూరి కలిల్లో యాం బండిస్తార్రా!" అనడిగాడు.

"యాం బండిచ్చే దేవుండాది, రాయిలే గదా!"

"ఇదే మాదిరి మన చుట్టుపక్క లూళ్లోళ్లందరూ గూడా కయిలన్నీ రాయిల గుంటలోళ్లకే అమ్మేసినా రనుకో! అవ్వుడు మన చుట్టువక్కలోళ్ల కయిల్లో యాం బండిస్తార్రా?"

"రాయిలే గదా!"

"మరవ్వుడు మన చుట్టువక్క లూళ్లల్లో ఎవురైనా వొడ్లు వండిచ్చే వో ళ్లుంటారంటావా?"

"ఎవరుంద్రు."

"మనూళ్లోగానీ, మన చుట్టువక్క లూళ్లలో గానీ వొడ్లు వండిచ్చే వోళ్లుఎవురూ లేకబోతే మనకి కూటికి బియ్యి మేద్నుంచొస్తాయి రబయా!"

తార్కికమైన ఈ ప్రశ్న రవిని ఆలోచనల్లోకి నెట్టింది. కొద్దిసేపు ఆలోచించాడు. తండ్రి చెప్పింది కూడా నిజమే అనిపించింది. కానీ కయిల్ని అమ్మేసి ఆ డబ్బుతో మావతో కలిసి ఫైనాన్స్ వ్యాపారం చెయ్యాలన్న కోరిక అక్టోపస్‌లా అతడి మనసును నలుదిశలా ఆక్రమించేసినందు వల్ల "వొడ్లు బండిచ్చినా, బండిచ్చకబోయినా పట్నంలో ఎవుడో ఒకడు బియ్యం అమ్ముతాడుగానీ మన కయిలు మాత్రం ఇంత దరబెట్టి ఇంకెవుడూ కొనడు. మన కిది ఎంతో మంచి రేటు. గాబట్టి కయి లమ్మెయ్యాల్సినదే!" ఖచ్చితంగా చెప్పాడు.

"ఒరే అబయా! వచ్చుదనంతో కళకళలాడే మన కయిల్లో గుంటలు గొట్టి రాయ్యాల నీను నీళ్లతో నింపేదానికి నే నొప్పుకోను!" అని కొడుకుతో చెప్పాలనుకున్న పెదరెడ్డి మాటలు ఎవరో నొక్కి పెట్టేసట్లు గొంతులోనే ఆగిపోయాయి.

'ఈడు జెప్పింది గూడా నిజమే. ఇంత రేటు బెట్టి మాత్రం ఇంకెవుడూ గొనడు. అయినా ఈడు జెప్పిన మాటల్లో మాత్రం యాడ్నో తేడా గన్పిస్తుండాది!' తనలో తనే అనుకున్నట్టుగా అనుకున్న మాటలు గొంతు దాటి బయటికి వచ్చాయి.

అవ్వుడే చింతచెట్టు కిందకి వచ్చి సుబ్బయ్యకు పెదరెడ్డి అనుకున్న మాటలు వినిపించేసరికి, "యాంది మావో యేదో తేడా గన్పిస్తుండా దంటుండావో" పెదరెడ్డి నడిగాడు సుబ్బయ్య.

"యామీ లేదులే, సుబ్బావా!" అంటూ నవ్వేశాడు పెదరెడ్డి.

"పొద్దన్నే ఇట్టొచ్చినా వేం మావా?" అడిగాడు సుబ్బయ్య.

"కళ్లాంలో గెడ్డుండాదే, కూలోళ్లని రమ్మన్నా! దాన్ని మోవులు గట్టించి ఈపొద్దు వామెయ్యించాల."

"యావైనా ఈసారి నీ పైరు ఇరగబండిం దబ్బా!"

"యాంబండ్యాం లాబం! పెట్టుబళ్లన్నీ బోను మహా అంటే వదివేలు కంటేఎక్కువ మిగల్దంట. మా యబ్బయ్య అన్నీ లెక్కలేసి మరీ జెప్పినాడు మావా!"

"నిజవేలే, మావా! ఎంతిరగబడి బండినా, మనకి మిగిలేది మాత్తరం ఆ బెత్తిడే!" నిరాశగా అనేసి వెళ్లిపోయాడు సుబ్బయ్య.


"నిజవే. మిగిలింది బెత్తిడే! ఆ బెత్తిడు మిగల్దానికి యెంత కష్టం జేసినానో!".

సేద్యగాళ్లతో కలసి కయ్యాల్ని దున్ని సాయంత్రం ఎద్దులు నాగళ్లతో ఇంటికి తిరిగి వస్తున్న పెదరెడ్డిని చూసి, "యాంమావో! వూరందరికంటే ముందరే దుక్కింజేసినట్టుండావే!" నవ్వుతూఅడిగాడు పోలయ్య.

"ఇంకో వారం దినాల్లో ఉత్తరకార్తి బెట్టేస్తది గద మావా! ఇవ్వుడు దున్నకబోతే రెండో సా రెవ్వుడు దున్నాల జెప్పు?"

పెదరెడ్డిఎవ్వుడూ కయ్యాల్ని రెండుసార్లూ దుక్కి దున్నందే పైరు పెట్టడు.అత డంత కష్టపడి రెండు సార్లూ దుక్కి దున్నాకనే పైరు పెడతాడు కనుకే ఊళ్లో అందరికంటే ఎక్కువ పంట పండిస్తూంటాడు.

"మావో! యావైనా నీకు బలే ఓపికలేయా! రెండుసాళ్లూ దున్నందే పైరు మాత్తరం పెట్టోవచ్చా నువ్వు!" అన్నాడు పోలయ్య.




పెదరెడ్డికి, పోలయ్యకు ఏ విధమైన బంధుత్వం లేదు. పైగా ఇద్దరూ ఒకే కులానికి చెందిన వాళ్లు కూడా కాదు. కానీ ఒకరి కొకరు ఎవ్వు డెదురుపడినా ఎంతో ఆప్యాయంగా 'మావా!' అని సంబోధించుకుని పలకరించుకుంటూంటారు.

కులాలు ఒకటి కాకపోయినా, మతాలు వేరైనా, బంధుత్వాలేమీ లేకపోయినా పల్లెటూళ్లలో ఒకరినొకరు 'మావా', 'అల్లుడా' అంటూ ఎంతో ఆప్యాయతలతో పిలుచుకోవడాలు జరుగుతూంటాయి.

ఉత్తరకార్తె పెట్టిన రోజు ఏ మాత్రం కేడి లేకుండా శుభ్రం చేసి దాచి ఉంచిన మేలిరకం వడ్లని ఇంకోసారి చెరిగించి శుభ్రం చేసి, నానబెట్టించాడు పెదరెడ్డి. ఆ వడ్లు ఒక రోజంతా బాగా నానిన తర్వాత కొత్త గంపల కెత్తించాడు. గంపల్ని పాత గోతాలతో కప్పెట్టి రెండుపూటలా జాగ్రత్తగా నీళ్లు చల్లించాడు. రెండు రోజుల తర్వాత గంపల మీద కప్పెట్టిన గోతాలు తీసి చూసేసరికి వడ్లన్నింటికీ తెల్లటి మోవులు కనిపించాయి. వడ్ల కొచ్చిన ఆ తెల్లటి మోవుల్ని చూస్తున్న పెదరెడ్డి మనసు ఆనందంతో ఉప్పొంగింది.

సేద్యగాళ్లను పురమాయించి మోవు లొచ్చిన వడ్ల గంపల్ని నెత్తి కెత్తించి, నారుమడి దగ్గరకు తీసుకెళ్లాడు. నారుమడి దగ్గర గంపల్ని దింపి, మోవులొచ్చిన ఆ వడ్లను బుట్టలోకి పోసుకుని స్వయంగా తన చేతులతోనే నారుమడిలో చల్లసాగాడు పెదరెడ్డి. వడ్లు చల్లటం పూర్తయ్యాక మడవ తెగ్గొట్టి మడిలో ఉన్న నీటిని జాగ్రత్తగా బయటకు తీసేశాడు. ఖాళీ గంపల్ని సేద్యగాళ్ల నెత్తుకోమని, తలకు కట్టుకుని ఉన్న తుండుగుడ్డ విప్పేసి మొహానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. ఖాళీ గంపల్నెత్తుకుని సేద్యగాళ్లు ఇంటికెళ్లారు. నారుమడి వైపు పోసారి తృప్తిగా చూసుకుని పెదరెడ్డి కూడా ఇంటికి వెళ్లాడు.

వేళకు అన్నం తినాలన్న ధ్యాస కూడా లేకుండా మూడు పూటలా నారుమడి దగ్గరకెళ్లి చల్లిన వడ్లు మొలిచాయో, లేదో అసలు మొలుస్తాయో, లేదో అని ఎంతో ఆత్రుతగా చూస్తూ, మూడు రోజులూ మూడు యుగాల్లా గడిపాడు పెదరెడ్డి.

నాలుగో రోజు పొద్దున్నే నారు మడి దగ్గర కెళ్లిన పెదరెడ్డికంటికి నారుమడి నిండా వచ్చటి మోవులతో కళకళలాడుతూ మొలకెత్తి ఉన్న నారుని చూసిఎనలేని ఆనందానికి గురయ్యాడు. తనే స్వయంగా వల్పగా నీరుకట్టి, కపిలబావి దగ్గరకొచ్చి కిందకు వంగి ఉన్న వేప చెట్టు కొమ్మని చేత్తో అందుకుని పుల్ల విరిచి నోట్లో పెట్టుకుని తృప్తిగా నమలసాగాడు.

వేపపుల్ల నములుతూ ఇంటికొచ్చి శుభ్రంగా మొహం కడుక్కుని, చద్దికూడు తెమ్మని భార్యతో చెప్పాడు.

అరు బయట గొంతుక్కూర్చుని ఉన్న భర్త దోసిటినిండా చద్దికూడు వేసిం దతడి భార్య. నాలుగు దోసిళ్ల కూడు తృప్తిగా తిన్న తర్వాత నాలుగు దోసిళ్ల కూట్నీళ్లు తాగి, "అబ్బ! కడుపులో నల్లగుండాదే!" అన్నాడు భార్యతో.

ప్రతిరోజూ రెండు పూటలా నారుమడి దగ్గరకెళ్లి నారుకి కావలసిన నీరు స్వయంగా తనే పెట్టి వస్తూండేవాడు పెదరెడ్డి.

కయిల్లోంచి వత్ర తోలుకుని వచ్చిన సేద్యగాడు రంగడిని చూసి, "యాపిరో రంగా! కయిల్లో జనుమంతా వత్రతో బాగా దొక్కించేసి దమ్ము జేసినావా లేదా?" అనడిగాడు పెదరెడ్డి.

"జనుమంతా నజిబిజి అయిపోయిం ద్సావా!" అన్నాడు రంగడు.

"సరే! ఎద్దుల్నీ వత్రని సుద్దంగా బురద లేకుండా కడిగేయ్!"

ఎద్దుల్ని కడిగి, వాటిని గాటన కట్టేసి, గాట్లో ఎండు గడ్డి వేసి, వత్రను కడగసాగాడు రంగడు.

'పాత దినాల్లో జనువుని నాగళ్లతోనే ఆరేడు సాళ్లు దున్నేవోళ్లం. అబ్బయ్యి ఎదిగొచ్చినాక ఈ వత్రని తెచ్చినాడు. అప్పుడు ఇ దెందుకురా మనకి అన్నా గూడా వోడి నలా. ఇప్పుడు దెలస్తుండాది దీ నవసర మేందో!' - వత్రవంక చూస్తూ అనుకున్నాడు పెదరెడ్డి.

వరినాట్లకి నెల ముందు పొలాల్లో జనుము చల్లడం, బాగా ఏపుగా ఎదిగిన జనుముని నాట్లకి ముందు ముందు వత్ర [జనుమూ, వగైరా చిన్న చిన్న మొక్కల్ని ముక్కలు ముక్కలు చేస్తూ కయిల్లోని మట్టినంతా కలియదిప్పుతూ ఎద్దులతో లాగబడే సాధారణ యంత్రం]తో పొలం అంతా కలియదిప్పడం. అలా చేయడం వల్ల పొలం బాగా సారవంతమవుతుంది. అలా చేసి వరినాట్లు నాటడం వల్ల కృత్రిమ ఎరువుల అవసరం లేకుండానే మంచి పంట పండుతుంది.

"ఒరే రంగో! రేపు మన పాలెపోళ్లందర్నీ నారేతకి రమ్మన్జెప్పినావా?" అనుమానంగా సేద్యగాడిని అడిగాడు పెదరెడ్డి.

"మూడ్దినాల నందే జెప్పేసినాన్సావే! అబ్బయ్యిగోరు గూడా రాత్రి పాలేని కొచ్చి అందుర్నీ నారేతకి రమ్మన్జెప్పిన్నారంట!"

"నువ్వు మూడ్దినాలనందే జెప్పేనుంటావని నాకు దెలుసురా! అబ్బయ్యి గూడా పాలేని కొచ్చి రాత్రే అందుకేర్నీ చెప్పేసినాథు గాబట్టి పాలెపోళ్లు మర్చిపొయ్యుండరు. అయినా నువ్వు రాత్రికి మళ్లీ అందురికీ జెప్పు! అన్నట్టు నారు పెరకుడి కొచ్చే వాళ్లందుర్నీ తొలిజాపు కాడ్నించే నారు బెరకాలని జెప్పు!" అంటూ మరునటి రోజు నారేతకి తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ సేద్యగాడికి వివరించి మరీ చెప్పాడు పెదరెడ్డి.

పశువుల కొట్టంలో పనులన్నీ పూర్తి చేసుకుని స్నానం చేసి రాత్రి అన్నం కోసం ఇంటెనక కూర్చున్న రంగడి గుంటకంచంలో ఉప్పుడు బియ్యన్నం వడ్డిస్తూ, "రంగో! పాలెంలో సుబ్బక్క దెగ్గిర మన కోళ్లుండాయి. వాటిల్లో అరు మంచి పుంజుల్ని పొద్దున్నే ... మన మడేలు దెగ్గిర తెచ్చీమని సుబ్బక్కతో జెప్పు!" అని రంగడితో చెప్పింది పెదరెడ్డి భార్య.

"అట్నేనమ్మో!" అని కంచంలోని అన్నం కూరతో కలవసాగాడు రంగడు.

వరి నాట్లు నాటేటప్పుడు, వరి కోతలు కోసేటప్పుడు కూలోళ్లందరికి మధ్యాహ్నం నంగళ్లోకి కోడి కూర వడ్డించటం పెదరెడ్డి కుటుంబానికి చాలాకాలంగా ఆనవాయితీ!

ఆరుబయట మంచం మీద పడుకుని ఉన్న పెదరెడ్డి మగత నిద్ర వేగుచుక్క పొడసూపకముందే పారిపోయింది. కళ్లు తెరిచి చూసిన అతడి కంటికి మసక వెన్నెల పల్చగా కనిపించింది. మంచం మీద లేచి కూర్చున్నాడు. మంచం పక్కనున్న రాగి చెంబులోని నీళ్లు తాగి మంచం దిగాడు. మంచన మీది తుండుగుడ్డ భుజం మీద వేసుకున్నాడు. పురుగూ పుట్రా అడ్డొస్తే పనికొస్తుందని కాబోలు పొన్ను కర్ర చేతికి తీసుకున్నాడు. మెల్లగా నారుమడి వైపు నడక సాగించాడు.

భర్త లేచి వెళ్లటం గమనించిన భార్య - 'ఇప్పుడే గనక నేనూ లెయ్యకబోతే కళ్లాపునులు, నద్దికూటి వార్పులూ తెమలవు!" అనుకుంటూ మంచం దిగి వాకిట్లో కళ్లాపు చల్లేందుకు సిద్ధమయింది.

మసక వెన్నెల్లోనే నారుమడి చేరుకున్నాడు పెదరెడ్డి. అప్పటికే నారుమడిలో నారు పెరికి కట్టలు కడుతున్న కూలోళ్లు కనిపించేసరికి - "రాత్తిరి కాడ్నే కయిలో దిగేసినట్టుండారు గదరే!" అన్నా డెంతో ఆనందంగా.

"కోడి కూతకు ముందరే మన రెడ్డిసానమ్మ కోడి కూర వానన ఈళ్లందుర్నీ లేపేసింది సావా!" నవ్వుతూ చెప్పా డొకడు.

ఆ మాటతో పెదరెడ్డితోపాటు అందరూ గొల్లున నవ్వేశారు.

కూలికీ, కూటికీ ఏమాత్రం ద్రోహం చెయ్యని పెదరెడ్డి పనంటే వాళ్లుఎంతో ఆనందంగా కూలికొస్తుంటారు పాలెపోళ్లు!

పెరికి కట్టలు గట్టిన నారు కట్టలవంకా, నారు పెరుకుతున్న కూలీలవంకా ఓ సారి తృప్తిగా చూశాడు పెదరెడ్డి. తర్వాత భుజంమీది తుండుగుడ్డని తలకు కట్టుకుని, పంచె కట్టుకుని నారుమడిలోకి దిగాడు.

కూలోళ్లతోపాటు కబుర్లు చెప్తూ తనూ నారు పెరికి కట్టలు కట్టసాగాడు. పొద్దు పొడిసేవరకు కూలీలతో కలిసి నారు పెరికి, నారు కట్టల్ని మోపులు కట్టించి ఇద్దరు కూలీల నెత్తిన మోపుల్ని పెట్టి, తనూ ఓ మోపు నెత్తిన పెట్టుకుని మడికయికి నారు మోపుల్ని మోశాడు పెదరెడ్డి.

నారుమోపుల్ని విప్పి నారు కట్టల్ని మడికయిల్లోకి విసిరేస్తున్న అతడి కంటికి పాళెం నుంచి నారేత కోసం గెనాల మీద నడిచొస్తున్న ఆడాళ్లు కనిపించారు.

సూర్యోదయంతోపాటే నారేత కోసం రంగు రంగుల చీరల్లో పాళెం నుంచి నడుస్తున్నారు వాళ్లు. వాళ్లని చూస్తూంటే ఇంద్రధనుస్సు నేలమీదకు దిగి నడుస్తోందా అనిపిస్తోంది!

కోక లెగగట్టి, కొంగుల్ని బొడ్లో దోపి నారేతకోసం మడికయిల్లోకి దిగారు ఆడాళ్లు.

గట్టు మీద చేరి వాళ్ల కందుబాటులో పడేటట్లు నారుకట్టల్ని విసిరేయసాగాడు పెదరెడ్డి.

నారు కట్టల కున్న ముడులు విప్పి వరినారుని క్రమబద్ధంగా మడికయిల్లో నాటసాగారు ఆడాళ్లు. సూరీడు సురసురలాడుతూ పైపైకి ఎగబాకే కొద్దీ రాగయుక్తంగా పాటలు పాడుతూ వడివడిగా వరినారు నాటసాగారు ఆడాళ్లు. వాళ్ల పాటల హుషారు చూసి తనూ చిన్నపిల్లాడిలా వాళ్ల పాటకు ఈల పాటతో వంతపాడుతూ నారు కట్టల్ని విసిరేయసాగాడు పెదరెడ్డి.


రంగడు నద్దికూటి దబర నెత్తిన పెట్టుకుని తేవడం చూసి కయ్యిల్లోంచి పైకి లేచారు ఆడాళ్లు.

నద్దికూటేళకి మూడెకరాలు నాటడం పూర్తి చేయడం చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు పెదరెడ్డి.

కబుర్లు చెప్పుకుంటూ నద్దికూడు తినడం పూర్తిచేసి, మళ్లీ కయిల్లోకి దిగారు ఆడాళ్లు. పొద్దు గూట్లో వాలడానికి దాదాపు గంట ముందరే పదెకరాల పొలం నాటడం పూర్తి చేశారు! పొద్దుటి వరకూ బురద నీళ్లతో బురదబురదగా చిందరవందరగా ఉన్నాయి మడికయ్యిలు. అలాంటి మడికయ్యి లిప్పుడు పసుపు, ఆకుపచ్చ కలగలిసిన కలనేత చీరల్ని ఎంతో క్రమబద్ధంగా కయ్యిల మీద పరచినట్లు కళకళలాడసాగాయి!

కళకళలాడుతున్న కయ్యిల వంకోసారి తృప్తిగా చూసుకుని ఇంటిదారి పట్టాడు పెదరెడ్డి.

అప్పటి నుంచి క్రమం తప్పకుండా రోజుకి అయిదారుసార్లు కయిల్లో కెళ్లి నీళ్లున్నాయో లేదో బాగా పరికించి మరీ చూసి, అవసరమనిపిస్తే తనే స్వయంగా నీళ్లు కడుతుండేవాడు.



## ఆరుద్ర ఛలోక్తులు ! వారసత్వం !



ఆరుద్రగారిని ఇటీవల రాజమండ్రిలో కలిసి సినిమా పాటల గురించి చర్చిస్తూ, "ఇప్పుడు వస్తున్న పాటలన్నీ గతంలో మీలాంటి సీనియర్ కవులు రాసిన పాటల బాణీలను అనుసరిస్తున్నాయి. కొన్ని పాటల చరణాలను, పల్లవులను కొద్దిపాటి మార్పులు చేర్పులతో ఇప్పటి కవులు తమ పేరుమీదుగా ప్రకటించుకోవడంపై మీ అభిప్రాయం ఏమిటి?" అని ప్రశ్నిస్తే - "దాందేముందండీ! మేము రాసిన సినిమా పాటలను ప్రజలు మరిచిపోయే అవకాశం లేకుండా మా వారసత్వాన్ని ఇప్పటి కవులు కాపాడుతున్నా రనుకుంటున్నాను!" అన్నారు ఛలోక్తిగా!

మహాకవి ఆరుద్రకు ఏడు పదులు నిండిన సందర్భంగా రాజమండ్రిలో ఇటీవల ఆయనకు ఘన సన్మానం జరిగింది. అప్పు డాయన ఏదో విషయం గురించి ప్రసంగిస్తూ సమాజం మార్పుపై ప్రస్తావన రాగానే "ఏదైనా సమాజంలో మార్పు రానిదే మనమేం చేయలేం!" అని దానికి ఒక గొప్ప ఉదాహరణ చెప్పారు.

"నేనూ, రామలక్ష్మి రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నాం. ఇద్దరం అభ్యుదయ దృక్పథంతో ఉండటం వల్ల నా మెళ్లో జంధ్యం లేదు. ఆమెకు మంగళసూత్రాలూ, కాలి మట్టెలూ లేవు. ఇలానే చాలాకాలం కాపురం చేశాం. కొంత కాలానికి రామలక్ష్మి కడుపుతో ఉంది. రోజూ ఆమె బస్సులో వెళ్లి వచ్చేది. ఒకరోజు ఇంటికి రాగానే, "ఏమండీ! మంగళసూత్రం ఒకటి తెచ్చి నా మెళ్లో కట్టేయండి!" అంది రామలక్ష్మి.

"ఎందుకు?" అన్నాను నేను.

"దానికి కారణం చెబుతూ ఆమె - "మన ఆశయాలూ, భావాలూ గొప్పవే అయినా సమాజంలో మార్పు రానప్పుడు మనం ఏమీ చేయలేం. రోజూ బస్సులో నేను వస్తుంటే అందరూ నా కడుపు వంకా, బోసిగా ఉన్న మెడవంకా చూస్తూ నన్ను అనుమానంగా చూస్తున్నారు. వెంటనే పసుపు తాడైనా సరే, నా మెళ్లో కట్టేయండి!" అంది రామలక్ష్మి" అన్నారు ఆరుద్ర నవ్వేస్తూ.

నిజమే. సరైన మార్పు సమాజంలో రానప్పుడుఒంటరి పోరాటం అసాధ్యమే!

సేకరణ : భాస్కరభట్ల [రాజమండ్రి]

రోజు. రోజుకీ ఏపుగా పెరుగుతూ ఆకుపచ్చరంగులో కళకళలాడుతున్న పైరు వంక ఎంతో తృప్తిగా చూసుకుని ఆనందించేవాడు.

"మావో! రోజు కైదారు తూర్లయినా కయిలకాడికి బోతుంటావు గదా! అన్నిసార్లు బొయ్ పైర్జూడకబోతే యాం మావా?" అనెవరైనా పెదరెడ్డిని అడిగితే,

"యజమాని ఒక్క పూట కయికాడికి బొయ్యి పైర్జూడకబోయినా నా యజిమానెందుకు రాలేదా అని కయ్యి కన్నీళ్లు గారస్తా బాదపడ్తా దంట" అని నవ్వుతూ సమాధానం చెప్పేవాడు.

ఒకరోజు రాత్రంతా జ్వరంతో బాధపడ్డ పెదరెడ్డి పొద్దున్నే కంబళి కప్పుకుని కయికాడికి పోవడానికి సిద్ధపడటం చూసి, ఇంత జ్వరంతో కయిలకాడి కెళ్లొద్దని ప్రాధేయపడితే, "చూడే! ఇప్పుడు నా కేం జెర వెక్కువుండాదని అట్ల జెప్తావు! ఇప్పుడు గాన నే న్నా కయిలకాడికి బోకబోతే నా పైరుకి జొరవొచ్చేస్తాదే!" అంటూ కంబళి ముసుగేసుకుని మరీ కయిలకాడ కెళ్లాడు.

అతడు కయిల్లోని పైరంతా కలియదిరిగి చూసి ఇంటికి తిరిగొచ్చేసరికి ఎంతో విచిత్రంగా ఏ మందవసరమూ లేకుండానే అతడి జ్వరం కాస్తా తగ్గిపోయింది!

భూమికీ, రైతుకీ ఉన్న గొప్ప సంబంధమేమిటో పెదరెడ్డిలాంటి రైతును చూస్తే తెలుస్తుంది!

పెదరెడ్డిని గతంలో నుంచి వాస్తవంలోకి లాక్కొస్తూ, "యాం మావో! ఈతూరి చింతకావు దండిగున్నట్టుండాదే!" చింత చెట్టు కాపు వైపు చూస్తూ పెదరెడ్డిని అడిగాడు పోలయ్య.

"యాందో! ఈ తూరి బాగనే ఉన్నట్టే అనిపిస్తాండాది మావా!" అన్నాడు పెదరెడ్డి.

"మావో! పోయి నేడు కాపు తొందరపడి వంద రూపాయలకే చింతకాయి ల్సెట్టికి అమ్మేసినావు. ఈతూరి మాత్తరం తొందరబడి కాపు గుత్తకమ్మెయ్‌బాక! ఈ యేడు టవున్లో చింతపండు దర చానా పలకతుందాంట!" పెదరెడ్డికి సలహా ఇచ్చాడు పోలయ్య.

"ఈ యేడు చింతపండు కంత దర యెందుకొచ్చిం దబ్బా?"

"యాపుండాది, మావా! ఇటికి సూళ్లేసే పెతోడూ చింతచెట్లు గొట్టి సూళ్లు మండేస్తుండారా! సుట్టుపక్కలూళ్లల్లో యేటి కేటికీ ఇటికి సూళ్లు గాల్చి మిద్దిలు మీద మిద్దిలు గట్టేవోళ్లు ఎక్కువైతూండారా, అందువల్లే చించెట్లన్నీ మాయవైబోతుండాయా! అట్లాటప్పుడు చింతపండు దర బెరగ్గ యాపంటాది జెప్పు? అయినా నువ్వు మాత్తరం తొందరబడి చింతకాయి ల్సెట్టికి కాపమ్మెయ్‌బాక!" అని వెళ్లిపోయాడు పోలయ్య.

పోలయ్య చెప్పిన మాటలు విన్న తర్వాత ఆలోచనల్లో పడ్డాడు పెదరెడ్డి.

చల్లటి గాలి తెమ్మెర పెదరెడ్డి మొహాన్ని తాకింది. అతడి మొహంలో సంతోషం ఒక్కసారిగా మెరిసింది.

కొడుకుకి ఏం సమాధానం చెప్పాలో తెలిసిం దతడికి!

'అబయా! నువ్వు జెప్పిందంతా నిజవేరా! అయినా నువ్వు జెప్పిందాంట్లో తేడా యెక్కడుందో, ఆ తేడా యాందో ఇప్పుడే తెలిసిందిరా!' అనుకుని, కొడుకుతో మాట్లాడాలని ఇంటికి తిరుగుముఖం పట్టిన పెదరెడ్డికి కపిలబావి దగ్గర కాలకృత్యాలు తీర్చుకుని ఎదురొస్తున్న కొడుకు కనిపించేసరికి కొడుకు వైపు సంతోషంగా చూస్తూ, "నీతో మాట్లాడదా మనుకుంటుండగానే నువ్వొచ్చినావంటే నీకు నూరేళ్లాయుష్షు రబయా!" అన్నాడు పెదరెడ్డి.

'నాయిన కయి లమ్మడానికి ఇష్టపడ్డట్టుండాడు. అందుకే గావాల నాతో మాట్లాడా లనుకునేది' అనుకున్నాడు రవి.

"ఒరే అబయా! ఈ చించెట్టు జూసినావా! ఇది మస్తే! దీన్ని ఇటికి సూళ్లేసుకునే వోళ్లు రెండు వేల కడిగినారు. నే నీసని కచ్చితంగా జెప్పేసినా! నే నెందు కీ చించెట్టు సమ్మనన్నాను?" కొడుకు నడిగాడు పెదరెడ్డి.

రవి సమాధానం చెప్పకుండా, 'ఈ విషయం న న్నెందు కడుగుతున్నాడు నాయన?' అని ఆలోచించాడు.

కొడుకేమీ సమాధానం చెప్పకపోయేసరికి పెదరెడ్డి మళ్లీ చెప్పసాగాడు -

"అబయా! యాటా దీని కాపు చింతకాయి ల్సెట్టికి అమ్ముతానే ఉండానా! పోయి నేడు గూడా దీని కాపు వంద రూపాయల కమ్మినానా! దీని కాపు యేటికి వందకే కదా అమ్ముతుండాం! ఒకేసారి రెండు వేలకి చెట్టే అమ్మేస్తే? ఆ రెండువేలకి వొడ్డీ జూసినా యేటికి నాలుగైదొందలు పైనే ఒస్తాది. అట్ల ఒడ్డీ ఆలోచిస్తే ఈ సెట్టు అమ్మెయ్యడం చానా అదాయం. గానీ నేను చెట్టు యెందు కమ్మలేదంటావు? ఈ చించెట్టు ఈడుంటే కయిలన్నీ దిరిగొచ్చి ఈ చెట్టు నీడలో సల్లంగా నిలబడి సేద దీరొచ్చు. ఎండలో దిరిగొచ్చినాక సల్లంగా నిలబడ్డానికి చెట్టు నీడే గావాలా? ఓ గొడుగు చాల్దా? అదొకొటి కొనుక్కుని చెట్టమ్మేస్తే పోలా అనొచ్చు నువ్వు. గానీ ఈ చించెట్టు ఇచ్చేంత చల్లటి నీడ ఎన్ని గొడుగులైనా యియ్యగలవా జెప్పురా!

"అంతేగాదురా, ఈ చించెట్టు అమ్మకుండా కాపు మాత్తరమే అమ్ముకుంటూండటం వల్ల మనకి సల్లటి నీడ దొరకడ మొక్కటే గాదురా - యేటా చింతకావు దర గూడా పెరగతా ఉండాది. చింతకావు అమ్ముకుంటే వేల రూపాయలతో

### కెనడాలో రహ్మాన్ పాటల రికార్డింగ్

రోజా చిత్రంతో విజయఢంకా మోగించిన సంగీత నిర్దేశకుడు ఎ.ఆర్.రహ్మాన్‌ను 'వండర్‌బాయ్' అని, మెలోడీ కింగ్ అని, 'మ్యూజిక్ విజర్డ్' అని రకరకాల అభినందిస్తున్నా రందరూ.

అతడు స్వరకల్పన చేసిన 'ఫంకీసాంగ్స్' పాడడానికి టోరంటో [కెనడా] రమ్మని, నటి-గాయని అయిన సుచిత్ర కృష్ణమూర్తికి ఆహ్వానం వచ్చింది. ఆమె ఆ పాటలు అక్కడ పాడగా రికార్డు చేశారు. వాటిని మ్యాగ్నాసౌండ్ వారు కాసెట్స్‌గా మార్కెట్ చేస్తున్నారు.

తారకం

ఒకేసారి మన జేబీలు నిండకపోయినా యేటి కేటికీ దరలు పెరుగుతూండటం వల్ల ఐదేళ్లకో, ఆరేళ్లకో ఒకతూరి లెక్క జూసుకుంటే ఒకేతూరి చెట్టమ్మిన దానికంటే యెక్కువ డబ్బులే వొస్తాయిరా! ఈ యేడు తొందరబడి చింతకావు అమ్మెయ్యోద్దనీ, చింతపొండు దర చానా పెరిగిపోయిందనీ ఇప్పుడే మన పోలయ్య మావ జెప్పిపోయినాడు. అసలు చింతపొండు దర అంతెందుకు పెరిగిపోయిం దంటావు?"

తండ్రి చెప్పిన దంతా విన్న రవి కొద్ది సేపు ఆలోచించి, "మన చుట్టుపక్క లూళ్లోళ్లందరూ ఇటికె నూళ్ల కోసం చించెట్లు నరికెట్టే గదా!" అన్నాడు రవి.

"మన సుట్టువక్క టూళ్లోళ్లందరూ ఇంటికె నూళ్ల కోసరం చించెట్లు నరికేస్తే చింతపొండు దర పెరిగిబోయింది. అట్టనే మనవూ మన సుట్టు పక్క టూళ్లోళ్లు అందురూగాన రొయిల గుంటలోళ్లకి కయిలమ్మేసి వొరి సేద్దెం మానుకుంటే వొడ్లూ బియ్యెం దరలు చానా పెరిగిబోతయా, లేదా?"

రవి ఏమీ సమాధానం చెప్పలేదు

"ఒరే అబయా! నా చిన్నప్పుడు ఒక బియ్యెం మూట ఐదు రూపాయలకిస్తూండేవోళ్లురా! అట్టాటి బియ్యెం మూటిప్పుడు ఐదొందల కంటే కూడా యెక్కువే ఉండాదిరా! రేప్పొద్దున, యెవ్వడూ వొడ్లు పండిచ్చకుండా మన కయిల్లో అంత రొయిలే పండిస్తే ఇప్పు ఱైదొంద లమ్మే బియ్యెం మూట ఐదువేలు గావొచ్చు పదివేలూ గావొచ్చు. అవునంటావా, గాదంటావా?"

మౌనమే రవి సమాధానం.

"అబయా! కయిలమ్మేసి ఆ డబ్బుల్తో వొడ్డీ యాపారం జేస్తే డబ్బు పెరుగుతుండా దనే ఆలోచిస్తూండావు గానీ, ఆ డబ్బు కుండే ఇలువ తగ్గిపోతుండడం మాత్తరం నువ్వు గెవనించలేకపోతూండావు రబయా! అంత గాదు రబయా! మనిషన్నోడు డబ్బు సంపాదనలో బడిపోతే అన్ని సుఖాలూ వొదులుకోవాల్సి వొస్తాదిరా! పట్నంలో వుండే మీ మావనే దీసుకో, ఆయన కో క్షణమైనా తీరికుండా దంటావా? ఆయ నే యాళప్పుడు ఇంట్లోంచి లేసిబోతడే, యే యాళవ్వు డింటి కొస్తాడో ఇంట్లోవోళ్ల కెవ్వరికైనా దెలుసా జెప్పు? అదే మనం జూడు, పన్లప్పుడు కష్టపడి జేసుకుంటాం, మిగిల్నప్పుడు ఆయిగా కాలి మీద గాలేసుకుంటాం. నీ లెక్క పెకారం జూస్తే యెవసాయంలో లాబం చానా తక్కువే గావొచ్చు. గానీ నా లెక్క పెకారం, అంటే యాటా పెరిగే దరల్తో జూసుకుంటే మనగ్గూడా యేం తక్కు వాదాయం లేదు రబయా! అంతేగాదురా, యే యాపారంలో లేని గొప్ప తృప్తి యవసాయంలో ఉండాదిరా! రైతన్నోడు యవసాయం జెయ్యడం వల్లే పదిమంది కడుపులు నిండుతూండాయిరా! అసలు నీ కో ఇసయం దెలుసా? పదిమంది కడుపునిండా కూడు దిని 'బేవ్'మని తేపే తేపులే రైతుకి శ్రీరామరక్షరా! రైతుకి యవసాయంలో యాపారస్తుల మాదిరి ఒకేతూరి లక్షలు మిగలవేమో గానీ, అంతకు మించిన ఆత్మ తృప్తి మిగల్తాదిరా!"

తండ్రి మాటలు రవిని ఆలోచనల్లోకి నెట్టాయి. 'నాయిన జెప్పింది గూడా నిజమే!' అనుకున్నాడు.

"ఒరే అబయా! నా చిన్నప్పుడు మా నాయ నో కత జెప్పేవోడ్రా! రాజుగోరొకరోజు పెజలకు వోళ్లు తృప్తి పడేటట్టు దానా లియ్యాలని అనుకున్నాడంట. వెంటనే కొంతమంది పెజల్ని కొలువికి బిలిపిసచినాడంట. కొలువు కొచ్చినోళ్లల్లో ఒకడికి నాలుగు బంగారు నాణేలు దానమిస్తే తీసుకున్నాడు. 'రాజుగారు ఇంకో రెండు నాణా లిచ్చుంటే బాగుండేది' అని జెప్పినాడంట వక్కనుండే వోడితో. అది విన్న రాజుగోరు ఇంకొకడికి ఆరు నాణాలిచ్చినారంట. వోడు గూడా 'ఇంకో రెండు నాణా లిచ్చుంటే బాగుండేది' అన్నాడంట. ... అట్ట యెందరికి ఎన్ని నాణా లిచ్చినా తృప్తి మాత్తరం ఎవుడికీ లేదంట. ఎవుడికీ నేనిచ్చిన దానాలు తృప్తి కలిగించలేదేం దబ్బా! 'ఈళ్లకి తృప్తి కలిగించేటట్టు దానవియ్యాలంటే ఎట్టా?' అని మంతిరిని అడిగితే, ఆయన బాగా ఆలోచించి 'అన్నదానం చెయ్'మన్నాడంట. సరేనని రాజుగోరు నాణాలు దానాలు తీస్కున్నోళ్లందరినీ బోజినానికి పిలిచి తృప్తిగా దినమన్నాడంట!

"రాజుగోరి బోజనం అందురూ కడుపుండా దిని, 'బేవ్'మని తేపినారంట. ఇంకొంచెం తినండని వోళ్లని రాజుగోరు బలవంత బెత్తే, 'అమ్మో ఇప్పటికే కడుపునిండా దినేసినాం. ఇంక దినలేం. సోవే!' అన్నారంట. అప్పుడు రాజుగోరుఅన్ని ధానాల్లోకి అన్నదానవే గొప్పదని దెలుసుకున్నారంట. అట్టాంటి గొప్పదైన అన్నాన్ని దానమియ్యగలిగేవోడు రైతొక్కడే రబయా! అన్నట్టు 'అంత లెక్కేసి జూస్తే నీ రెక్కల కష్టం దవ్వ నీకు చివర కేం మిగిలింది నాయినా?' అన్నావు గదరా!

"ఒరే అబయా! రొయిల గుంటలోళ్లకి కయిలమ్మేసి ఆ డబ్బులు వొడ్డీకిచ్చుకుంటూ పట్నంలో ఉంటే నాలుగు డబ్బులు మిగలచ్చేవేగానీ, నేను కష్టం జేసి పండిచ్చిన ఈ వొడ్లే నలుగురికి కడుపునింపి వా ళ్లాకలి దీర్చిందన్న తృప్తి నాకు మిగలదురా!" అన్నాడు పెదరెడ్డి.

రవి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయాడు.

కొడుకు వైపు పరీక్షగా చూసిన పెదరెడ్డి మొహం సంతోషంతో నిండిపోయింది!

★

## అమితాభ్ తిరిగి నటిస్తాడా?

ఇన్నాళ్లుగా జవాబు దొరకని శేష ప్రశ్నగా మిగిలిపోయింది. అమితాభ్ బచ్చన్ పునఃప్రవేశం ఈ రంగంలోకి! రాజకీయం రంగం విరక్తి కలిగాక, సెటిలైట్ ఛానల్స్ పైకి మనసు మళ్లిన అమితాభ్ తిరిగి చిత్రాల్లో నటించడం అబద్ధంకాదని బొంబాయి చిత్ర రంగ వార్త. బి.ఆర్.చోప్రా 'ఏక్ అవుర్ మసీహా' అనే స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాడు తన తాజా చిత్ర నిర్మాణానికి. ఈ కథకు ప్రధానం ఒక జడ్జి పాత్ర. ['తీర్పు' వంటి చిత్రం కావచ్చు] ఆ పాత్ర పోషించడానికి అర్హుడు అమితాభ్ ఒక్కడే అన్నాడుట బి.ఆర్.చోప్రా మరి!

తారకం

